జాతరకు 'కూడవెల్లి' సిద్ధం

- నేటి నుంచి రామలింగేశ్వర ఉత్సవాలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ కమిటీ
- ఐదు రోజుల పాటు వేడుకలు


భక్తులు స్నానమాచరించనున్న వాగు


కూడవెల్లి రామలింగేశ్వర ఆలయం

దుబ్బాకరూరల్: మాఘఅమావాస్య సందర్భంగా భూంపల్లి మండలం కూడవెల్లి రామలింగేశ్వరాలయం జాతరను శనివారం నిర్వహించేందుకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. మాఘఅమావాస్య రోజున వాగులో స్నానమాచరించి, దైవదర్శనం చేసుకుంటే సకల పాపాలు తొలగుతాయని భక్తుల నమ్మకం. వాగులోస్నానమాచరించి స్వామికి పూజలు చేసేందుకు సరిహద్దు జిల్లాలు మెదక్, సంగారెడ్డి, నిజామాబాద్, వరంగల్, రాజన్న సిరిసిల్లా, కరీంనగర్ జిల్లాలకు చెందిన భక్తులు వస్తుంటారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. రంగు రంగుల విద్యుత్ దీపాలతో ఆలయాన్ని అలంకరించారు.

పూజా కార్యక్రమాలు..

ఆలయంలో పార్వతి సమేత రామలింగేశ్వరస్వామి, రాధరుక్మిణి వేణుగోపాలస్వామి, మహాగణపతి, వీరభద్రస్వామి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, శ్రీవేంకటేశ్వరస్వామి, బొబ్బిలి వీరన్న, హనుమాన్ ఆలయాలు ఉన్నాయి. మాఘఅమావాస్య సందర్భంగా రామలింగేశ్వరస్వామికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, సర్వదర్శనం నిర్వహించి, సాయంత్రం పల్లకీ సేవలో ఊరేగిస్తారు. బుధవారం ఉదయం స్వామి వారికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, సాయంత్రం స్వామి వారికి అభిషేకం, బిల్వార్చన తదితర పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. భక్తుల సౌకర్యార్థం బారికేడ్ల నిర్మాణం, నీటి గుండం వద్ద తాత్కాలిక స్నానపు గదులను సిద్ధం చేశారు. ఆలయ ఆవరణలో మిఠాయిల దుకాణాలు, ఇతర బొమ్మల దుకాణాలు వెలిశాయి. శాంతిభద్రతలకు ఆటంకం కలగకుండా పోలీస్ కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు.

అన్ని ఏర్పాట్లు చేశాం



జాతర సందర్భంగా ఆలయానికి వచ్చే భక్తులకు సౌకార్యార్థం అన్ని ఏర్పాట్లు చేశాం. భక్తులు క్యూ లైన్లో వెళ్లడానికి బారికెడ్లు, గుండంలో పుణ్యస్నానాలకు గదులను ఏర్పాటు చేశాం.

– చంద్రం, ఆలయ చైర్మన్

సీసీ కెమెరాలతో భద్రత



ఆలయంలో భక్తుల సౌకర్యార్థం సీసీ కెమెరాలు, పోలీస్ కంట్రోల్ రూం ఏర్పాటు చేశాం. వాహనాల పార్కింగ్‌కు స్థలం, సాయం అందించేందుకు వలంటీర్లు, మెడికల్ సిబ్బంది అందుబాటులో ఉంటారు. ఏమైనా ఇబ్బందులు కలిగితే కంట్రోల్ రూంలో ఫిర్యాదు చేయాలి.

– విశ్వనాథశర్మ, ఆలయ ఈఓ

ఆర్జిత సేవలు ప్రారంభం



మాఘఅమావాస్య సందర్భంగా నేటి నుంచి జాతర ప్రారంభమవుతోంది. మాండవ్య నదిలో పుణ్య స్నానాలు చేస్తారు. బుధవారం వరకు ఉత్సవాలు జరుగుతాయి. భక్తులు క్యూ లో వచ్చి దైవ దర్శనం చేసుకోవాలి.

– సంకేత్ శర్మ, అర్చకుడు

ప్రతీ రోజు వ్యాయామంతో ఆరోగ్యం

- అదనపు డీసీపీ అడ్మిన్ మహేందర్


విజేతలతో అదనపు డీసీపీ అడ్మిన్ మహేందర్

హుస్నాబాద్: ఆరోగ్యం కోసం ప్రతీరోజు వ్యాయామం చేయాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండి ఉన్నత విద్యను అభ్యసించి జీవితంలో స్థిరపడాలని అదనపు డీసీపీ అడ్మిన్ మహేందర్ అన్నారు. రన్నర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలో శుక్రవారం నిర్వహించిన 5కె రన్ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఫిట్‌గా ఉండేందుకు ప్రతిరోజు సాధన చేయాలని, యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని అన్నారు. అనంతరం విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రఘు, సీఐ రఘు, ఎస్ఐ శ్రీధర్, అసోసియేషన్ బాధ్యులు రమేష్, సంపత్, వెంకటనర్సయ్య, సత్యనారాయణ రెడ్డి, శ్రీనివాస్, బాపురెడ్డి, మహేందర్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

కూడవెల్లిలో పూజలు..

దుబ్బాకరూరల్: కూడవెల్లి రామలింగేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం అడిషనల్ డీసీపీ అడ్మిన్ మహేందర్ పూజలు చేశారు. అనంతరం ఏసీపీ దేవారెడ్డి, ట్రాఫిక్ ఏసీపీ ఫణీందర్, సీఐ కృష్ణతో కలిసి జాతర ఏర్పాట్లను పరిశీలించారు. భక్తులకు అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు చేయాలని ఆలయ సిబ్బంది, పోలీస్ అధికారులకు సూచించారు. ఆలయ చైర్మన్ పూజారి చంద్రం, ఈఓ విశ్వనాథ శర్మ, అర్చకులు సంకేత్‌శర్మ పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి


రోడ్డుపై నిరసన తెలుపుతున్న బీజేవైఎం, బీజేపీ నేతలు

గజ్వేల్‌రూరల్: విద్యారంగ సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని బీజేవైఎం నాయకులు ఆరోపించారు. ఫీజు రీయంబర్స్‌మెంట్, పెండింగ్ స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం గజ్వేల్‌లో ప్రభుత్వ దిష్టి బొమ్మను దహనం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు రూ.5వేల కోట్ల పెండింగ్ బకాయిలు ఉన్నాయని, బకాయిలు విడుదల కాక విద్యార్థులు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నిధులను విడుదల చేయాలని కోరారు. ధర్నా చేస్తున్న బీజేపీ, బీజేవైఎం నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో బీజేవైఎం పట్టణ, మండల అధ్యక్షుడు ఆర్‌కే యాదవ్, మహేష్‌చారి, జిల్లా ఉపాధ్యక్షుడు మనోహర్‌యాదవ్, బీజేపీ అసెంబ్లీ కోకన్వీనర్ మహేష్, బీజేపీ, బీజేవైఎం నాయకులు పాల్గొన్నారు.

తెగులు నివారణతో దిగుబడి


వరి పైరును పరిశీలిస్తున్న ఏఓ జగదీశ్వర్

దుబ్బాక: వరిసాగులో తెగుళ్ల నివారణతో దిగుబడి పెరుగుతుందని రాయపోల్ మండల వ్యవసాయాధికారి జగదీశ్వర్ అన్నారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో వరి పంటలను పరిశీలించి, రైతులకు అవగాహన కల్పించారు. వరి పైరుకు మొగిలి పురుగు ఆశించడంతో పైరు ఎర్రగా మారి దిగుబడి తగ్గుతుందన్నారు. వరి నాట్లు వేసి 15 నుంచి 30 రోజుల్లోపు పురుగు ఉధృతి గమనిస్తే క్లోరాంట్రానిలిప్రోల్ 4జీ గుళికలు ఎకరానికి 4 కిలోల చొప్పున లేదా కార్టాప్ హైడ్రాక్లోరైడ్ 4జీ గుళికలను ఎకరానికి 8కిలోల చొప్పున చల్లాలని సూచించారు. పురుగు అంకురం దశ నుంచి పొట్ట దశలో మారుతున్నట్లు గుర్తిస్తే క్లోరాంట్రానిప్రోల్ 18.5 ఎస్‌పీ మందును ఎకరానికి 60 ఎంఎల్ చొప్పున చల్లుకోవాలన్నారు.

ఘనంగా లక్ష్మీనరసింహస్వామి రథోత్సవం


రథోత్సవంలో మహిళా భక్తులు

సిద్దిపేటరూరల్: పుల్లూరు స్వయంభూ లక్ష్మీ నరసింహస్వామి బండ జాతర ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు ఘనంగా రథోత్సవం కార్యక్రమాన్ని శుక్రవారం గ్రామస్తులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పాఠశాల నుంచి బండ పైకి స్వామివారి ఉత్సవ విగ్రహాలను ప్రధానవీధుల గుండా ఊరేగించారు. ఊరేగింపులో కళా ప్రసాద్‌సాంస్కృతిక నృత్య ప్రదర్శన, భజనలు నిర్వహించారు. 30 మంది పోలీసులతో భద్రతను పర్యవేక్షిస్తున్నట్లు అదనపు డీసీపీ అడ్మిన్ మహేందర్ తెలిపారు. భక్తులకు క్యూలైన్లు, ట్రాఫిక్ సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో సిద్దిపేట ట్రాఫిక్ ఏసీపీ ఫణీందర్, రూరల్ సీఐ జానకి రాంరెడ్డి, ఎస్ఐ కిరణ్ రెడ్డి, అర్చకులు వీణా చారి, నవీన్ కుమార్, రమణా చారి, ఫణి కుమారాచారి, వైద్య కృష్ణమాచారి, పుల్లూరు సర్పంచ్ పల్లె నరేష్ గౌడ్, ఉప సర్పంచ్ ప్రసాద రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నియామకం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలో రెండెకాల స్థలంలో కుమ్మర్ల కోసం చేపడుతున్న నిర్మాణ పైలెట్ ప్రాజెక్టు ఇన్‌చార్జ్‌గా పట్టణానికి చెందిన నెల్లుట్ల విజయ్‌ను ఎన్నుకున్నారు. శుక్రవారం జిల్లా కుమ్మర సంఘం అధ్యక్షుడు దరిపల్లి శ్రీను ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఈ నియామకం చేపట్టారు. కో ఇన్‌చార్జ్‌గా మూడపల్లి భూమయ్యను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు నార్లపురం తిరుపతి, యువజన విభాగం అధ్యక్షుడు రామ చంద్రం, వృత్తి విభాగ అధ్యక్షుడు కట్కూరి రవీందర్, గౌరవ అధ్యక్షుడు రాజు, ఉపాధ్యక్షుడు రాదారి కృష్ణమూర్తి, కోశాధికారి సంపత్, సిద్దిపేట నియోజకవర్గ కో ఇన్‌చార్జ్ మహేష్, అర్బన్ మండల అధ్యక్షుడు శ్రీశైలం, చిన్నకోడూర్ మండల అధ్యక్షుడు దరిపల్లి శ్రీను, సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు రాములు పాల్గొన్నారు.

వరి సాగులో సస్యరక్షణ అవసరం


మాట్లాడుతున్న శాస్త్రవేత్త విజయ్‌కుమార్

చిన్నకోడూరు(సిద్దిపేట): యాసంగిలో వరి సాగు చేసే రైతులు అప్రమత్తంగా ఉండాలని తోర్నాల సెంటర్ శాస్త్రవేత్త విజయ్ కుమార్ అన్నారు. శుక్రవారం చిన్నకోడూరు రైతువేదికలో వరి సాగులో చీడపీడలు, నివారణ, యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. యాసంగిలో వరిలో గొట్టం, మొగి పురుగు ఉధృతి అధికంగా ఉంటుందని, చేనులో కొనలపైన రెక్కల పురుగులు, కాండం తొలుచు పురుగు ఆశించి పంటను ఎదగకుండా నష్టం కలిగిస్తాయన్నారు. నారు నాటే వారం రోజుల ముందు నారుమడికి కార్బోఫామ్ వేసుకోవాలని, సందేహాలు ఉంటే వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలని అన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి జయంత్ కుమార్, ఏఈఓ ఝాన్సీ, నాయకులు అబ్బిరెడ్డి, అశోక్ రెడ్డి రైతులు తదితరులు పాల్గొన్నారు.

నంగునూరు(సిద్దిపేట): వరి పంట పిలకదశలో కాండం తొలుచు పురుగు నివారణకు చర్యలు చేపట్టాలని ఏఓ గీత రైతులకు సూచించారు. శుక్రవారం సిద్దన్నపేట, అంక్షాపూర్ గ్రామాల్లో పంట పొలాలను పరిశీలించి రైతులకు అవగాహన కల్పించారు. మండలంలో పదివేల ఎకరాలకు పైగా వరి సాగైందని, ప్రస్తుతం పిలక దశలో కాండం తొలచు పురుగు ఆశించినట్లు గుర్తించామన్నారు. పొలాల్లో లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసి, ఎకరాకు పది కిలోల కర్బోఫ్యూరాన్ త్రీజీ గుళికలు చల్లుకోవాలని సూచించారు.

కరపత్రం ఆవిష్కరణ


కరపత్రం ఆవిష్కరిస్తున్న దృశ్యం

సిద్దిపేటకమాన్: సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో ఈ నెల 22న ఆదివారం సాయంత్రం 4 గంటలకు సంఘ వార్షికోత్సవం, పురస్కారాల ప్రదానం నిర్వహించనున్నట్లు వెన్నెల సాహితీ వార్షికోత్సవ బాధ్యులు తెలిపారు. కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో యార్లగడ్డ రాఘవేంద్రరావు కవితా సంపుటి 'పచ్చి కడుపు వాసన'కు వార్షిక పురస్కారం, కవులు కలకుంట్ల జగదయ్య, శ్రీధర్‌కు జీవన సాఫల్య పురస్కారాలు అందజేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కవి సూర్య ప్రకాశ్ పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్ష, కార్యదర్శులు నర్సింహ్మారెడ్డి, యాదగిరి, రాజు, మల్లారెడ్డి, మహిపాల్, ఉమాశంకర్ పాల్గొన్నారు.

'అవిశ్వాసం.. అవాస్తవం'

చేర్యాల(సిద్దిపేట): చేర్యాల మున్సిపల్ చైర్ పర్సన్‌పై అవిశ్వాసం పెడుతున్నట్లు వస్తున్న వార్తల్లో నిజం లేదని మున్సిపల్ బీఆర్ఎస్ ఫ్లోర్‌లీడర్ మంగోలు చంటి అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి ఆధ్వర్యంలో పట్టణ అభివృద్ధికి పాటు పడుతామని స్పష్టం చేశారు. అధికార బీఆర్ఎస్ కౌన్సిలర్ల మధ్య ఎలాంటి విభేదాలు లేవని, ఒకవేళ ఉన్నా వాటిని అంతర్గతంగా చర్చించి పరిష్కరించుకుంటామని, అవాస్తవాలను ప్రజలు నమ్మొద్దని అన్నారు.

స్కాలర్‌షిప్‌ను విడుదల చేయాలి


ధర్నా చేస్తున్న బీజేవైఎం నాయకులు

హుస్నాబాద్: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని బీజేవైఎం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వం మూడేళ్లుగా ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయకుండా విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 18 లక్షల మంది విద్యార్థులు ఫీజు రియంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల కోసం ఎదురు చూస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ గుర్రాల లక్ష్మారెడ్డి, కో కన్వీనర్ వేణుగోపాల్‌రావు, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొమ్మగాని సతీష్, జిల్లా ప్రధాన కార్యదర్శి కర్ణకంటి నరేష్, నాయకులు భీమేశ్వర్, తోట సమ్మయ్య, సతీష్, మహేశ్వర్, సాయి, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

దుబ్బాకరూరల్: భూంపల్లి మండలం చిట్టాపూర్ గ్రామానికి చెందిన సిద్దిని రాజమణికి సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరైన రూ.20వేల చెక్కును శుక్రవారం సర్పంచ్ పోతనక రాజయ్య అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

◆ బహిరంగ వేలం

దుబ్బాక:పట్టణంలోని 1 వార్డులోని డబుల్ బెడ్రూం ఇళ్ల వద్ద గల 8దుకాణ సముదాయలకు, 14వ వార్డులోని లాల్ బహదూర్ శాస్త్రి విగ్రహం వద్ద గల 13 దుకాణాలకు మూడేళ్ల అద్దెకు వేలం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ పాతూరి గణేష్ రెడ్డి తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ఈ నెల 28న సాయంత్రం 5 గంటల లోపు దరఖాస్తు చేసుకోవాలని, ఈ నెల 31న మున్సిపల్ కార్యాలయంలో బహిరంగ వేలం ఉంటుందన్నారు. వేలంలో పాల్గొనేవారు రూ.50 వేలను దుబ్బాక పురపాలక సంఘం పేరమీద డీడీ తీసి దరఖాస్తుతో జత చేయాలన్నారు.

◆ ఆర్థిక సాయం

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని అనంతసాగర్‌లో అనారోగ్యంతో మృతి చెందిన చెందిన క్యాసారం రేణుక కుటుంబానికి స్నేహితులు, గ్రామస్తులు, భవన నిర్మాణ కార్మికులు, శివాజీ యూత్, జ్ఞాన విజ్ఞాన యూత్ సభ్యులు రూ.70 వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ లావణ్య, యూత్ సభ్యులు, పాల్గొన్నారు.

◆ ఆపదలో అండగా..

దుబ్బాక: రాయపోల్ మండలం రామసాగర్ బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు రాగి చంద్రం కుమారుడు రాజు ఇటీవల మృతి చెందగా, ఆయన కుటుంబాన్ని నాయకులు మామిడి మోహన్ రెడ్డి పరామర్శించారు. రూ.6 వేల ఆర్థిక సాయం అందజేశారు. కొత్తపల్లిలో ఇటీవల ఆత్మహత్య చేసుకున్న మృతుడి కుటుంబానికి రూ.8వేల సాయం అందజేశారు.

మర్కూక్(గజ్వేల్): మండలంలోని పాములపర్తి గ్రామానికి చెందిన అక్కారం అనసూయ శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందగా, మృతురాలి కుటుంబాన్ని శుక్రవారం ఎంపీపీ పాండుగౌడ్, జెడ్పీటీసీ మంగమ్మ, బీఆర్ఎస్ బీసీ సెల్ మండలాధ్యక్షుడు మేకల కనకయ్య పరామర్శించారు. అనంతరం రూ.4 వేల ఆర్థిక సాయం అందించారు.

గజ్వేల్‌రూరల్: అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కొడకండ్లకు చెందిన చిలసారం నర్సింలుకు శుక్రవారం గజ్వేల్ ఆత్మ కమిటీ డైరెక్టర్ కూరాకుల సాయి రూ.5వేల సాయం అందించారు. ఆయనతో బీఆర్ఎస్‌వీ గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ వైస్ ప్రెసిడెంట్ సాయిమహేష్, నాయకులు స్వామి, మల్లేశం, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

◆ బీఆర్ఎస్ దిష్టిబొమ్మ దహనం

వర్గల్(గజ్వేల్): విద్యార్థుల స్కాలర్‌షిప్పులు, ఫీజు రీయంబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని బీజేపీ, బీజేవైఎం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం వర్గల్ అంబేద్కర్ చౌరస్తాలో శుక్రవారం బీఆర్ఎస్ ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో మండల బీజేపీ, బీజేవైఎం అధ్యక్షుడు శ్రీరాం శ్రీకాంత్, రవీందర్‌గౌడ్, నాయకులు మహిపాల్‌యాదవ్, రమేష్, మహేష్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

◆ విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ


విద్యార్థినులకు సైకిళ్లను పంపిణీ చేస్తున్న దృశ్యం

దుబ్బాక: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను ఏర్పరుచుకుని లక్ష్యం దిశగా ముందుకు సాగాలని డివైన్ వర్డ్ సోషల్ సర్వీస్ సొసైటీ డైరెక్టర్ సురేశ్ అన్నారు. శుక్రవారం రాయపోలు మండలంలోని జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేశారు. విద్యార్థి దశ నుంచే కష్టపడితే ఉన్నతస్థాయికి చేరుకోవచ్చని అన్నారు. కష్టపడి చదివి మంచి మార్కులు తెచ్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సంస్థ కోఆర్డినేటర్ నరేందర్, హెచ్ఎం సత్తయ్య, ఉపాధ్యాయులు, తదితరులున్నారు.

రెండో రోజూ నేత్ర పరీక్షలు


చేర్యాల: వృద్ధుడికి అద్దాలు అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తిరెడ్డి


వర్గల్: అంబర్‌పేటలో మహిళకు కంటి అద్దాలు అందజేస్తున్న కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్

సాక్షి నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా రెండో రోజు కంటి వెలుగు శిబిరాలు అన్ని మండలాల్లోని ఆయా గ్రామాల్లో కొనసాగాయి. వర్గల్ మండలం అంబర్‌పేటలో కంటి వెలుగు శిబిరాన్ని శుక్రవారం కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ సందర్శించారు. పరీక్షల నిర్వహణపై అడిగి తెలుసుకున్నారు. ఆయనతో జెడ్పీటీసీ బాలమల్లు, ఎంపీపీ లత, పీఏసీఎస్ చైర్మన్ రామకృష్ణారెడ్డి, సర్పంచ్ నర్సింహరెడ్డి, ఎంపీడీఓ స్వర్ణకుమారి, గడా అధికారి ముత్యంరెడ్డి తదితరులు ఉన్నారు. ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి శుక్రవారం చేర్యాల మండలంలో 1వ వార్డు, ఆకునూరులో శిబిరాలను సందర్శించారు. నేత్ర పరీక్ష చేసుకున్న పలువురికి ఆయన అద్దాలను పంపిణీ చేశారు. తొగుట మండలంలో కేంద్రాన్ని, నంగునూరు మండలం అంక్షాపూర్, ఖానాపూర్ గ్రామాల్లో శిబిరాలను జిల్లా వైద్యాధికారి కాశీనాథ్, ఖానాపూర్‌లో డీపీఓ దేవకీదేవి శిబిరాలను తనిఖీ చేశారు. కొమురవెల్లి మండలంలోని అయినాపూర్ కంటి వెలుగు శిబిరాన్ని, మద్దూర్ మండల కేంద్రంలోని కంటి వెలుగు శిబిరాన్ని అదనపు కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ శుక్రవారం పరిశీలించారు. ఆయనతో డాక్టర్ సంకర్షణ్ ఆచార్య, భరత్, పంచాయతీ కార్యదర్శి బాలరాజు తదితరులు ఉన్నారు. హుస్నాబాద్ పట్టణం 1వ వార్డు, 11వ వార్డుల్లో శిబిరాలను మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, కమిషనర్ రాజమల్లయ్య, వైస్ చైర్‌పర్సన్ అనిత, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ సౌమ్య పరిశీలించారు. మిరుదొడ్డిలో మానిటరింగ్ అధికారి సాయిరాం, సిద్దిపేట పట్టణంలోని 7, 24, 31 వార్డులో మున్సిపల్ కమిషనర్ రవీందర్ రెడ్డి, చిన్నకోడూరులో ఎంపీపీ మాణిక్య రెడ్డి, దుబ్బాకలో మున్సిపల్ చైర్‌పర్సన్ వనిత భూంరెడ్డి, అక్కన్నపేట మండల రామవరంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని శుక్రవారం బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి సరోజదేవి సందర్శించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కొప్పుల సత్యపాల్‌రెడ్డి, సర్పంచులు ముత్యాల సంజీవ్‌రెడ్డి, వనపర్తి స్వప్న, కార్యదర్శులు లక్ష్మీకాంతరావు, సతీష్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


నంగునూరు: అంక్షాపూర్‌లో శిబిరాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా వైద్యాధికారి కాశీనాథ్


హుస్నాబాద్: శిబిరాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత


సిద్దిపేటజోన్: వివరాలు తెలుసుకుంటున్న మున్సిపల్ కమిషనర్ రవీందర్ రెడ్డి

క్లుప్తంగా

మంత్రికి ఆహ్వానం


మంత్రి హరీశ్‌రావుకు ఆహ్వాన పత్రిక అందిస్తున్న నాయకులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని తిగుల్‌నర్సాపూర్ కొండపోచమ్మ జాతర ఉత్సవాలకు రావాలని మంత్రి హరీశ్‌రావుకు ఆలయ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, ఈఓ మోహన్‌రెడ్డి శుక్రవారం ఆహ్వానం అందించారు. ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డికి ఆహ్వానం అందించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మదాసు శ్రీనివాస్, సర్పంచ్ రజిత, సిబ్బంది వెంకట్‌రెడ్డి, కనకయ్య, డైరెక్టర్లు సంతోష్, శ్రీనివాస్, జానకిరాములు తదితరులు పాల్గొన్నారు.

ఆహ్లాదంగా ప్రకృతి వనం


మొక్కలను పరిశీలిస్తున్న కమిషనర్ గణేశ్‌రెడ్డి

దుబ్బాకటౌన్: ప్రకృతి వనంలో నాటిన మొక్కలు ఏపుగా పెరిగి వనమంతా ఆహ్లాదకరంగా మారిందని మున్సిపల్ కమిషనర్ పాతూరి గణేశ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని 8వ వార్డులో పట్టణ ప్రకృతి వనాన్ని ఆయన పరిశీలించారు. వనంలో కలియ తిరుగుతు మొక్కలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

గాయపడిన విద్యార్థులకు సాయం అందించాలి


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

సిద్దిపేటరూరల్: ఉపాధ్యాయుడు కొట్టడంతో గాయపడిన విద్యార్థులకు విద్యాశాఖ ద్వారా తక్షణ సాయం అందించాలని ఎస్ఎఫ్ఐ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు అరవింద్ అన్నారు. శుక్రవారం మండలంలోని పుల్లూరు ప్రాథమిక పాఠశాలను సందర్శించి, విద్యార్థులతో మాట్లాడారు. విద్యాబుద్ధులు చెప్పాల్సిన ఉపాధ్యాయుడు గాయపర్చడం సరికాదని అన్నారు. ఆయనతో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి నవీన్, నాయకులు సంతోష్, మాణిక్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారుడికి అభినందన


విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

సిద్దిపేటఎడ్యుకేషన్: జాతీయస్థాయి బాల్ బాడ్మింటన్ పోటీల్లో కళాశాల విద్యార్థి ప్రతిభ చూపడం గర్వకారణమని ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ ప్రసాద్ అన్నారు. బీఏ తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి నవీన్‌ను, పీటీ ఇన్‌చార్జ్ విశ్వనాథంలను శుక్రవారం అభినందించారు. ఇటీవల మంగళూర్‌లో జరిగిన అంతర విశ్వ విద్యాలయ బాల్ బాడ్మింటన్ పోటీల్లో నవీన ప్రతిభ చూపినట్లు తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై ఆసక్తిని పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో జంతుశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ అయోధ్యరెడ్డి, వాణిజ్యశాస్త్ర అధ్యాపకులు డాక్టర్ బాలచంద్రం, తెలుగు విభాగాధిపతి మహేందర్, పాండు, భరత్ తదితరులు పాల్గొన్నారు.

సన్మానం


లింగంను సన్మానిస్తున్న నాయకులు

దుబ్బాకటౌన్: బీఆర్ఎస్ ప్రభుత్వం గొర్రెకాపరులకు అన్ని విధాలుగా న్యాయం చేస్తుందని ఆ సంఘం రాష్ట్ర నాయకులు బట్టు ఎల్లం అన్నారు. శుక్రవారం పట్టణంలోని పెద్దమ్మ ఆలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా ఎన్నికైన రుద్రారం లింగం యాదవ్‌ను శుక్రవారం సన్మానించారు. గొర్రెకాపరులకు సబ్సిడీ గొర్రెల యూనిట్లు అందించడంతో పాటు రాజకీయంగా సముచిత గౌరవం కల్పించడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు తిరుపతి, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.